# ఇందిరమ్మ కాలనీ పరిశీలించిన సబ్ కలెక్టర్



**ఉద్యమ కెరటం, తాండూర్:** మండలంలోని కొత్తపల్లి గ్రామపంచాయతీ పరిధిలో గల ఇందిరమ్మ కాలనీని సోమవారం బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ పరిశీలించారు. 2007 సంవత్సరంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ హాయంలో అర్హులైన 196 మంది నిరుపేదలకు ఇళ్ల పట్టాలు అందజేయడం జరిగింది. అప్పటి నుంచి నేటివరకు ఆ కాలనీలో విద్యుత్, మంచి నీటి సమస్య అందుబాటులో లేకపోవడంతో ఆ కాలనీలో నేటి వరకు ఇళ్ల నిర్మాణం ఎవరు చేపట్టలేదు. అర్హులైన లబ్ధిదారులు అందరూ కలిసి కోరుతూ ఎన్నో సంవత్సరాలుగా తమ సమస్యను పరిష్కరించాలని అధికారుల దృష్టికి తీసుకు వెళ్లడం జరిగింది. ఈ నేపథ్యంలో సబ్ కలెక్టర్ ఆ కాలనీని పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడి పూర్తి వివరాలను తెలుసుకున్నారు. నివేదిక తయారుచేసి జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లడం జరుగుతుందని తెలిపారు. ఆయన వెంట తాండూర్ తహశీల్దార్ జోత్స్న, కొత్తపల్లి గ్రామ సర్పంచ్ ఆకుల వెంకటేష్, ఎంపీడీఓ శ్రీనివాస్, విద్యుత్ శాఖ ఏఈ జాన్సన్, ఎంపీఓ అనిల్ కుమార్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ ఎజాజుద్దీన్, పంచాయతీ కార్యదర్శి మెరుగు లక్ష్మణ్, రెవెన్యూ సిబ్బంది, లబ్ధిదారులు ఉన్నారు.

# కూరగాయల మార్కెట్ షెడ్ నిర్మాణానికి భూమి పూజ



**ఉద్యమ కెరటం, గంభీరావుపేట:** గంభీరావుపేట మండల కేంద్రంలో గ్రామ అభివృద్ధికి మరో ముందడుగు పడింది. గ్రామంలో కూరగాయల మార్కెట్ షెడ్ నిర్మాణానికి సర్పంచ్ మల్లుగారి పద్మ నర్సయ్య గౌడ్ పాలకవర్గం ఆధ్వర్యంలో సోమవారం భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థా నిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, నాయకులు పాల్గొన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా రూ.10 లక్షలు, గ్రామపంచాయతీ నిధుల నుంచి రూ.5 లక్షలు కలిపి మొత్తం రూ.15 లక్షల వ్యయంతో మార్కెట్ షెడ్ నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హమీద్ మాట్లాడుతూ రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అజ్మతుల్లాహ్ హుస్సేని, కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జీ కేకే మహేందర్ రెడ్డి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మార్కెట్ షెడ్ నిర్మాణం పూర్తయిన తర్వాత గ్రామంలోని రైతులు, వ్యాపారులు తమ కూరగాయలను సౌకర్యవంతంగా విక్రయించుకునే అవకాశం కలుగుతుందన్నారు. ప్రజలకు కూడా మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని అన్నారు. గ్రామాభివృద్ధికి ఇలాంటి కార్యక్రమాలు కొనసాగిస్తామని పేర్కొన్నారు.

# లేబర్ కార్డుపై అపోహలు వద్దు



**ఉద్యమ కెరటం, బెజ్జూర్:** వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులు లేబర్ కార్డులు చేసుకోవాలని సూపర్వైజర్ సాజిద్ సూచించారు. లేబర్ కార్డు గురించి అనవసర అపోహలు పెట్టుకోకుండా కార్మికులకు దక్కాల్సిన హక్కులు పొందేందుకు ప్రతిఒక్కరు తప్పనిసరిగా ఈ కార్డు తీసుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లేబర్ కార్డు కలిగిన కార్మికులకు ప్రతి సంవత్సరం ఉచిత వైద్య పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. ఈ కార్డును ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి రెన్యువల్ చేయాల్సి ఉంటుందని చెప్పారు. కార్డు కలిగిన కార్మికుడి కూతురు వివాహానికి ఆర్థిక సహాయం అందించడంతో పాటు కుటుంబంలో రెండు ప్రసవాలకు ఉచిత సేవలు, తగు ఆర్థిక సహాయం అందుతుందని వివరించారు. అదేవిధంగా కార్డు కలిగిన వ్యక్తి ప్రమాదంలో గాయపడి అంగవైకల్యం చెందితే, మరణిస్తే ప్రభుత్వం ద్వారా ఆర్థిక సహాయం అందుతుందని తెలిపారు. మండలంలోని ప్రతి కార్మికుడు లేబర్ కార్డు తప్పనిసరిగా చేసుకోవాలని పేర్కొన్నారు. మండలంలో ప్రస్తుతం 48 మంది కార్డుదారులు ఉండగా, ఇప్పటివరకు 8 మంది మాత్రమే రెన్యువల్ చేసుకున్నారని, మిగతా వారు కూడా త్వరగా రెన్యువల్ చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మీసాలు వైకుంఠం, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రామ సమస్యల పరిష్కారానికి కలెక్టర్‌కు వినతి



**ఉద్యమ కెరటం, కాగజ్‌నగర్:** కాగజ్‌నగర్ మండలంలోని వంజిరి గ్రామపంచాయతీ పరిధిలో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు జిల్లా కలెక్ట ర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. గ్రామంలో తాగునీటి సమస్య, రోడ్ల దుస్థి తి, డ్రైనేజీ సమస్యలు, వీధిదీపాల కొరత, పింఛన్లు, ఇతర ప్రాథమిక సౌకర్యాల లోపాల గురించి వివరించారు. ఈ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఉప సర్పంచ్, వార్డు సభ్యులు కూడా తమ తమ వార్డుల్లో ఉన్న సమస్యలను కలెక్టర్ దృష్టి కి తీసుకువచ్చారు. ఈ విషయాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ సమస్యలను అధ్యయనం చేసి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# భవన నిర్మాణ పనులను పరిశీలించిన ఏపీఎం



**ఉద్యమ కెరటం, జైనూర్:** సిర్పూర్ మండల కేంద్రంలోని మహాగావ్ గ్రామంలో నిర్మిస్తున్న మహిళ సంఘం (వీఓ) భవన నిర్మాణ పనులను ఏపీఎం మేస రమేష్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామైక్య సంఘాలకు ప్రత్యేక భవనాల నిర్మాణం ద్వారా మహిళలకు మరింత భరోసా కలుగుతుందని తెలిపారు. ఈ భవనంలో నిర్వహించే స్వయం ఉపాధి కార్యక్రమాల ద్వారా మహిళలు ఆర్థికంగా మరింత పురోగతి సాధించే అవకాశాలు ఉంటాయని పేర్కొన్నారు. భవన నిర్మాణ పనులు నాణ్యతతో పాటు త్వరితగతిన పూర్తయ్యేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామ మహిళా సంఘాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేకంగా ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు.

# సీసీ రోడ్డు పనులు ప్రారంభం



**ఉద్యమ కెరటం, తాండూర్:** మండలంలోని మాదారం త్రీఇంక్లైన్ గ్రామంలో సోమవారం సీసీ రోడ్డు పనులను సర్పంచ్ చందనాల రవికుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి మెయిన్ రోడ్డు నుంచి సత్తిరెడ్డి ఇంటి వరకు రూ.4లక్షల ఉపాధిహామీ పథకం ద్వారా రోడ్డు నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ తాండూర్ మండల అధ్యక్షుడు ఎండి ఈసా, మాజీ ఎంపీపీ సిరంగి శంకర్, ఏ ఈ సాయిలత, ఉప సర్పంచ్ చింతపూరి మల్లేశ్వరి, వార్డు సభ్యులు కుర్సెంగ తిరుపతి, చందనాల లత, వాసాల అనిల్ కుమార్, గొర్లపల్లి కమలాకర్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# తాగునీటి పైపులైను పనులు ప్రారంభం

**ఉద్యమ కెరటం, తాండూర్:** మండలంలోని మాదారం గ్రామపంచాయతీ పరిధిలో గల పోచంపల్లి గ్రామంలో నూతన నీటి పైప్ లైన్ పనులను సోమవారం గ్రామ సర్పంచ్ కుశనపల్లి లక్ష్మణ్, ఉప సర్పంచ్ దామోదర్ రెడ్డిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కుశనపల్లి లక్ష్మణ్ మాట్లాడుతూ నూతనంగా ఏర్పాటు చేసే ఈ పైప్ లైన్ పోచంపల్లి గ్రామంలోని నీటి ట్యాంక్ నుంచి గ్రామంలోని ప్రతి ఇంటికి మంచి నీటిని సరఫరా చేయడానికి నిర్దేశించినది అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ అనిల్ కుమార్, వార్డు సభ్యులు గొర్లపల్లి బాణేష్, పంచాయతీ కార్యదర్శి అల్లావుద్దీన్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# ఎస్ ఐ ఆర్ మ్యాపింగ్ చేయించుకోవాలి

## మున్సిపల్ వైస్ చైర్మన్ ఎం.డి. అహ్మద్



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్:** పట్టణంలోని బజార్ వాడీలో సోమవారం నిర్వహించిన ఎస్.ఐ.ఆర్ (SIR) మ్యాపింగ్ ప్రత్యేక కార్యక్రమానికి ఆసిఫాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్ ఎం.డి. అహ్మద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మ్యాపింగ్ ప్రక్రియను దగ్గరుండి పరిశీలించిన ఆయన, సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన ఈ మ్యాపింగ్ ప్రక్రియ పౌరులందరికీ ఎంతో కీలకమని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా తమ వివరాలను నమోదు చేయించుకోవాలని పిలుపునిచ్చారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పిస్తూ, ఆఎవరూ మిగిలిపోకుండా ఈ ప్రక్రియను విజయవంతం చేయాలని ఆయన సిబ్బందికి సూచించారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేసి మ్యాపింగ్‌ను వేగవంతం చేయాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో బి.ఎల్.ఓలు లక్ష్మి , దేవమ్మ, తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది అభిషేక్, సాయి పాల్గొన్నారు. నాయకులు షబ్బీర్, మొయిన్ తదితరులు పాల్గొన్నారు.

# చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి



**ఉద్యమ కెరటం, బెజ్జూర్:** విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని దీక్షిత ఫెర్టి లైజర్ప్రొప్రైటర్ కవ్వాల సాయి అన్నారు. మండల కేంద్రంలోని గిరిజన విద్యార్థినిలకు దీక్షిత ఫెర్టిలైజర్ ఆధ్వర్యంలో క్రీడా దుస్తులు, క్రీడా సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలపై మక్కువ ఉన్నప్పటికీ సరైన సామగ్రి లేక చాలా మంది క్రీడాకారులు ముందుకు రావడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు తమవంతుగా ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. మారుమూల ప్రాంతాలకు చెందిన గిరిజన విద్యార్థి నులు క్రీడా రంగంలో రాణించాలని, వారికి అవసరమైన సామగ్రి కొరత లేకుండా సహాయం చేయడం తమ బాధ్యతగా భావిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు మారుబాయి, వార్డెన్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థి నులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ జయంతి వాల్‌పేపర్ పోస్టర్ల ఆవిష్కరణ



**ఉద్యమ కెరటం, కాగజ్‌నగర్:** కాగజ్‌నగర్ పట్టణంలోని దీక్ష భూమి వద్ద డాక్ట ర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా నిర్వహించనున్న ఉత్సవాలకు సంబంధించి కరపత్రాలు, వాల్‌పేపర్ పోస్ట ర్లను అంబేద్కర్ వాదులు సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ జయంతి ఉత్సవ కమిటీ, సిర్పూర్ తాలూకా సభ్యులు మాట్లాడుతూ డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలను అందరూ గుర్తుచేసుకుంటూ కులాలకు అతీతంగా సమానత్వ భావంతో జయంతి వేడుకలను నిర్వహించుకోవాలని పిలుపునిచ్చారు. అంబేద్కర్ చూపిన మార్గం సమాజానికి దిక్సూచి అని పేర్కొన్నారు. యువత ఆయన ఆలోచనలు, సిద్ధాంతాలను ఆచరణలో పెట్టాలని సూచించారు. రాబోయే జయంతి ఉత్సవాల్లో ప్రజలందరూ పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, అంబేద్కర్ అభిమానులు పాల్గొన్నారు.

# జనగణన పకడ్బందీగా జరగాలి

## జిల్లా కలెక్టర్ రాజర్షిషా




**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** దేశ భవిష్యత్తు ప్రణాళికల రూపకల్పనకు, సంక్షేమ పథకాల సమర్థవంతమైన అమలుకు జనగణన అత్యంత కీలకమని జిల్లా కలెక్ట ర్ రాజర్షిషా అన్నారు. 'జనగణన నుంచి జన కల్యాణం'అనే నినాదంతో ఈ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. స్థానిక టీటీడీసీలో సోమవారం నిర్వహించిన 'సెన్సస్–2027' ఫీల్డ్ ట్రైనర్ల మూడు రోజుల శిక్షణ ముగింపు సమావేశంలో పాల్గొని ట్రైనర్లకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఈ గణనలో ప్రతి వ్యక్తి వివరాలు ఖచ్చితంగా నమోదు కావాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా ఇళ్ల జాబితా తయారీ, గృహ గణన సమయంలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. క్షేత్రస్థాయిలో గణన నిర్వహించే సిబ్బందికి ఫీల్డ్ ట్రైనర్లు సమగ్ర అవగాహన కల్పించాలని తెలిపారు. డిజిటల్ విధానంలో నిర్వహించనున్న ఈ ప్రక్రియలో సాంకేతిక అంశాలపై పూర్తి పట్టు సాధించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, ట్రైనింగ్ కలెక్టర్ సలోని చాబ్రా, పర్యవేక్షకులు నలంద ప్రియ, మాస్టర్ ట్రైనర్లు కె.శ్రీహరి బాబు, యువరాజ్, సంబంధిత విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధిలోని కొమ్మేపల్లి సింగరేణి క్వార్టర్స్ ప్రాంతంలోని జామాయిల్ తోటలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. మృతుడు పురుషుడిగా గుర్తించారు. శవం పూర్తిగా కుళ్లిపోయి అస్థిపంజర స్థితిలో ఉంది. మృతుడికి నీలం రంగు ప్యాంటు ధరించి ఉండగా, కుడి చేతికి ఎరుపు రంగు దారం కట్టుకొని ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. అలాగే దవడ భాగంలో శస్త్రచికిత్స చేసి ఆనవాళ్లు ఉండగా, ఐరన్ ప్లేట్ ఉన్నట్లు సమాచారం. మృతుడి వయస్సు సుమారు 25 నుంచి 30 సంవత్సరాల మధ్య ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. ఈ ఘటనపై సత్తుపల్లి పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ వ్యక్తి గురించి వివరాలు తెలిస్తే సత్తుపల్లి పోలీస్ స్టేషన్ సెల్: 87126 59167, 87125 51362లపై సంప్రదించాలని పోలీసులు కోరారు.

# సీఈఐఆర్ పోర్టల్ ద్వారా మొబైల్ ట్రేస్

### బాధితుడికి ఫోన్ అందజేసిన ఎస్సై



**ఉద్యమ కెరటం, జైనూర్:** మొబైల్ ఫోన్లు పోయిన సందర్భంలో సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేస్తే ఫోన్లను ట్రేస్ చేసి తిరిగి పొందడం సులభమవుతుందని ఎస్సై గంగన్న తెలిపారు. లింగాపూర్ మండలంలో పోగొట్టుకున్న మొబైల్ ఫోన్‌ను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ట్రేస్ చేసి సోమవారం బాధితుడికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఫోన్‌ను తిరిగి పొందడంతో బాధితుడు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజల సహకారం అవసరం



**ఉద్యమ కెరటం, జైనూర్:** సిర్పూర్(యు) మండలంలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజలు సహకరించాలని ఎస్సై రామకృష్ణ కోరారు. సోమవారం మండల ప్రజలకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపరాదని, వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. మైనర్ యువకులకు వాహనాలు నడపడానికి ఇవ్వవద్దని తల్లిదండ్రులకు సూచించారు. ప్రతిఒక్కరు రోడ్డు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, అతివేగంగా వాహనాలు నడపకూడదని తెలిపారు. మద్యం, గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు.

# సొంత ఇల్లు అమ్మి దర్శకుడు

- నిర్మాతగా ముందుకొచ్చిన షేక్ నసీర్
- సినిమా కోసం ధైర్య నిర్ణయం
- ఆడిషన్లు నిర్వహించి ప్రతిభావంతుల ఎంపిక



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** సినిమా రంగంలో అవకాశాల కోసం ఎన్నో ఏళ్లుగా ప్రయత్నాలు చేసిన ఆదిలాబాద్‌కు చెందిన షేక్ నసీర్ చివరకు తన కలను నిజం చేసుకోవడానికి సొంత ఇల్లు అమ్మి దర్శకుడు, నిర్మాతగా ముందుకు వచ్చిన ఘటన ఆసక్తి రేపుతోంది. తాను ఎన్నో సంవత్సరాలుగా రాసిన కథలను వివిధ ప్రొడ్యూసర్లకు వివరించినప్పటికీ అవకాశాలు రాకపోవడంతో తన సమయం వృథా అయిందని నసీర్ తెలిపారు. చివరికి తానే ధైర్యంగా ముందడుగు వేసి తన సొంత ఆస్తులు అమ్మి సినిమా నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఆడిషన్లు నిర్వహించి ప్రతిభావంతులను ఎంపిక చేశారు. ఎంపికైన వారికి ప్రశంసా పత్రాలు అందజేశారు. గుడిహత్నూర్‌కు చెందిన కళ్లేపల్లి అరుణ్, చందాపురే అలోక్ ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో దారుణం మూవీ డైరెక్టర్ గణేష్, భీమన్నతో పాటు పలువురు కళాకారులు పాల్గొన్నారు. కొత్త ప్రతిభకు అవకాశాలు కల్పిస్తూ మంచి సినిమా తీసే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు షేక్ నసీర్ తెలిపారు.

# మంచినీటి సమస్యకు పరిష్కారం

- నూతన బోర్‌వెల్‌కు భూమి పూజ చేసిన సర్పంచ్ లక్ష్మి శంకర్



**ఉద్యమ కెరటం, బెజ్జూర్:** మండలంలోని మూగవల్లి గ్రామపంచాయతీలో నెలకొన్న మంచినీటి ఎద్దడిని దృష్టిలో ఉంచుకుని నూతన బోర్‌వెల్‌కు సర్పంచ్ కొడప లక్ష్మి శంకర్ సోమవారం భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. గ్రామంలో తాగునీటి సమస్యను ఎమ్మెల్సీ దండే విఠల్ దృష్టి కి తీసుకెళ్లగా, ప్రజాపాలన అభివృద్ధి ప్రణాళికలో భాగంగా మిషన్ భగీరథ నిధులతో మంజూరైన బోర్‌వెల్‌ను మహిళా శక్తి భవనం వద్ద ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామంలోని ప్రతి ఇంటికి రక్షిత తాగునీరు అందించడం తమ లక్ష్యమని, చెడిపోయిన బోర్‌వెల్‌లను మరమ్మత్తు చేయించడంతో పాటు అవసరమైన చోట కొత్త బోర్‌వెల్‌లు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. గతంలో ప్రతి ఇంటికి ఇచ్చిన నల్లా కనెక్షన్‌లను కూడా మరమ్మత్తు చేయిస్తూ నీటి సరఫరాను ప్రతిరోజు పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. ప్రజాపాలన అభివృద్ధి ప్రణాళికలో భాగంగా గ్రామంలో మంచినీరు, వీధిదీపాలు, పారిశుధ్యం వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలు అర్హులైన ప్రతి పేదవారికి అందేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధికి సహకరిస్తున్న ఎమ్మెల్సీ దండే విఠల్, కాంగ్రెస్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఆలం సీతారాం, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు మడే చంద్రయ్య, పంచాయతీ కార్యదర్శి రాజేశ్వర్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఇచ్చిన మాట నిలబెట్టుకున్న భూక్యా జాన్సన్ నాయక్

- బాలుడి చికిత్సకు అండగా నిలిచి.. ప్రాణాపాయం నుంచి రక్షణ



**ఉద్యమ కెరటం, ఖానాపూర్:** మున్సిపల్ ఎన్నికల ప్రచార సమయంలో ఇచ్చిన మాటను నిలబెట్టు కుంటూ బీఆర్ఎస్ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ ఇంచార్జ్ భూక్యా జాన్సన్ నాయక్ ఓ చిన్నారి చికిత్సకు అండగా నిలిచారు. కడెం మండలం ధర్మాజీపేట్ గ్రామానికి చెందిన కడారి శివకుమార్–శిరీష దంపతులు ప్రస్తుతం ఖానాపూర్ పట్టణంలోని శాంతినగర్‌లో నివాసం ఉంటున్నారు. వీరి రెండేళ్ల కుమారుడు కడారి బన్నీ కొంత కాలంగా తీవ్రమైన మూత్ర సంబంధిత సమస్యతో బాధపడుతూ ఉండగా కుటుంబం తీవ్ర ఆందోళనకు గురైంది. చిన్నారి ఆరోగ్యం క్షీణించడంతో చికిత్స కోసం సహాయం అందించాలని ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో జాన్సన్ నాయక్‌కు కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేశారు. ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ జాన్సన్ నాయక్ స్పందించారు. కుటుంబాన్ని స్వయంగా పరామర్శించి చిన్నారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని అవసరమైన వైద్య సహాయం అందించేందుకు ముందుకొచ్చారు. నిపుణులైన వైద్యులతో సంప్రదించి బాలుడిని ఆసుపత్రిలో చేర్పించి చికిత్స ప్రారంభించేలా చర్యలు తీసుకున్నారు. సమయానికి శస్త్రచికిత్స నిర్వహించడంతో చిన్నారి ఆరోగ్యం మెరుగుపడింది. తమ బిడ్డ ప్రాణాపాయం నుంచి బయట పడేందుకు సహకరించిన జాన్సన్ నాయక్‌కు ఆ దంపతులు కృతజ్ఞతలు తెలిపారు. సమస్య చెప్పగానే స్పందించి తమ బిడ్డకు ప్రాణం పోశారని, తమ కుటుంబానికి అండగా నిలిచిన ఆయన సేవలను జీవితాంతం మర్చిపోలేమని భావోద్వేగంతో పేర్కొన్నారు.

# నాలుగేళ్లుగా పెండింగ్‌లో ఉన్న హత్య కేసు ఛేదన

- ఎస్పీ నితిక పంత్ ప్రత్యేక దర్యాప్తుతో నిందితుల అరెస్ట్



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:** ఆసిఫాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో నాలుగేళ్లుగా పెండింగ్‌లో ఉన్న హత్య కేసును జిల్లా పోలీసులు ఛేదించారు. జిల్లా ఎస్పీ నితిక పంత్ ప్రత్యేక శ్రద్ధతో కేసును పునఃపరిశీలించి ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేయడంతో నిందితులను గుర్తించి అరెస్ట్ చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. 2022లో పెంచికల్పేట్ మండలానికి చెందిన సాగర్ అనే వ్యక్తి ఆసిఫాబాద్ నుంచి గుండి గ్రామానికి వెళ్లే మార్గంలో మృతదేహంగా కనిపించాడు. మొదట అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన పోలీసులు తదుపరి దర్యాప్తులో అది హత్యగా నిర్ధారించారు. అయితే కేసు నాలుగేళ్లుగా పెండింగ్‌లో ఉంది. ఈ కేసును ఎస్పీ నితిక పంత్ పర్యవేక్షణలో ఆసిఫాబాద్ టౌన్ సీఐ బాలాజీ వరప్రసాద్, డీసీఆర్‌బీ ఇన్స్పెక్టర్ శ్రీధర్, ఐటీ కోర్ ఇన్స్పెక్టర్ రవీందర్, కౌటాల సీఐ సంతోష్ కుమార్, ఐటీ కోర్ కానిస్టేబుల్ మహేష్‌లతో ప్రత్యేక బృందం ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు. సాంకేతిక ఆధారాలు సేకరించి కౌటాలలోని బీసీ బాయ్స్ హాస్టల్లో కుక్‌గా పనిచేస్తున్న మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం తాళ్లపేట్ గ్రామానికి చెందిన కొండూరి మల్లేశ్వరి, కాగజ్నగర్లోని ద్వారకానగర్కు చెందిన ఎన్నం అశోక్, పెంచికల్పేట మండలం ఆగర్గూడ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ చెన్నూరి స్వామి అలియాస్ తిరుపతిలను నిందితులను గుర్తించారు. కాగా ఎన్నం అశోక్ ప్రస్తుతం పరారీలో ఉన్నాడు. మల్లేశ్వరి కుమార్తెతో బాధితుడు మాట్లాడుతున్నాడనే అనుమానం, వ్యక్తిగత విభేదాల కారణంగా నిందితులు ముందుగానే పతకం ప్రకారం హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. సాగర్‌ను కాగజ్‌నగర్‌కు పిలిచి ఆటోలో తీసుకెళ్లి ఆసిఫాబాద్ మండలం గుండి గ్రామ శివారులోని పంట పొలాల వద్ద దాడి చేసి గొంతు నులిమి హత్య చేసి పరారయ్యారు. సాంకేతిక ఆధారాలు, విచారణలో నిందితులు నేరాన్ని ఒప్పుకున్నట్లు తెలిపారు. నిందితులను కోర్టు లో హాజరుపర్చగా రిమాండ్ విధించినట్లు పేర్కొన్నారు. పరారీలో ఉన్న నిందితుడి కోసం పోలీసులు గాలింపు కొనసాగిస్తున్నట్లు వివరించారు. ఈ కేసు ఛేదనలో కృషి చేసిన పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ నితిక పంత్ అభినందించారు.

# కార్యకర్తలకు అండగా ఉంటాం



- డీసీసీ అధ్యక్షుడు నరేష్ జాదవ్

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** కార్యకర్తలకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ నరేష్ జాదవ్ అన్నారు. పట్టణానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రాములు సోదరుడు కైలాష్ లక్ష్మణ్ ఇటీవల మృతి చెందడంతో రవీంద్రనగర్ కాలనీలో సోమవారం నిర్వహించిన పెద్దకర్మకు హాజరై కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబానికి అన్ని విధాలుగా సహాయం చేస్తామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట టీపీసీసీ మాజీ జనరల్ సెక్రటరీ గండ్ర సుజాత, మాజీ డీసీసీ సాజిద్ ఖాన్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అల్లూరి సంజీవరెడ్డి, జిల్లా కాంగ్రెస్ కోశాధికారి అభిషేక్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ జనరల్ సెక్రటరీలు బాబన్న, అక్తర్ అలీ, ఎస్సీ సెల్ జైనథ్ మండల అధ్యక్షుడు బిక్కి గంగాన్నతో పాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

# రోడ్డు భద్రత అందరి బాధ్యత

**ఉద్యమ కెరటం, బోథ్:** రోడ్డు భద్రత అందరి బాధ్యత అని కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంచార్జ్ ఆడే గజేందర్ అన్నారు. రోడ్డు భద్రతపై సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్లక్ష్యం, అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం వంటి వాటితో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు పోలీసులు చేపట్టిన అరైవ్.. అలైవ్ కార్యక్రమాన్ని అభినందించారు. ఆటో, జీపు, కారు, లారీ, ట్రాక్టర్ డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని పేర్కొన్నారు. ప్రతి డ్రైవర్ జాగ్రత్తగా వ్యవహరించి తనతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా కాపాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కుర్మే అన్నపూర్ణ మహేందర్, బోథ్ బ్లాక్ ఆత్మ చైర్మన్ గొర్ల రాజు యాదవ్, దన్నూర్ సర్పంచ్ రోహిణి వినయ్ రెడ్డి, బోథ్ సీఐ గురుస్వామి, బోథ్ ఎస్సై పురుషోత్తం, బజార్ హత్నూర్ ఎస్సై సంజయ్ కుమార్, నాయకులు, అధికారులు, డ్రైవర్లు పాల్గొన్నారు.



